




# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

శనివారం | 31 మే 2025

పేజీలు 8




మట్టితో బూడిపోయిన చెరువు తూము



ముళ్ళ పొదలతో నిండిన చెరువు గట్టు

- ప్రశ్నార్థకంగా మారిన 80 ఎకరాల సాగు
- అవస్థలు పడుతున్న గిరిజనులు
- బండిఆత్మకూరు మండలంలోని నారపురెడ్డికుంట గిరిజన గూడెంలో గిరిజనుల అవస్థలు

# ప్రశ్నార్థకంగా మారిన గిరిజనుల జీవితాలు

**బండిఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** బండి ఆత్మకూరు మండలం చిన్నదేవలాపురం మజరా గ్రామమైన నారపుకుంట గిరిజన తాండాలో సాగునీటి కోసం గిజనులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఉన్న చెరువుకు సాగు నీరు రాకపోవడంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉంది.గత 30 ఏళ్ళ నుంచి ఇక్కడ ఉన్న గిరిజనులు సాగునీటి వసతి కల్పించాలని కోరుతున్నా ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిదులు పట్టించుకునేవారు కరువయ్యారు. ఈ గిరిజన తాండాలో సుమారు 90 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అయితే పక్కనే ఉన్న సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో నారపురెడ్డికుంట చెరువు ఉంది. గత కొన్ని సంవత్సరాల నుంచి వర్షపునీరు చెరువులోకి రావడంలేదు. దీంతో చెరువు కింద ఉన్న సుమారు 100 ఎకరాల

మిగతా 2లో



నారపురెడ్డికుంట చెరువు దృశ్యం

# ఖరీఫ్ సాగులో కర్షకలోకం

- ముందస్తు వానలతో విత్తుతో రైతులు పొలం బాట
- పత్తి పంట పై ఆశలు..గతేడాది నిండా ముంచిన మిరప
- తుంగాతీరానా వరినారల జోరు



పొలం పనులలో నిమగ్నులైన రైతులు,కూలీలు

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** ఉమ్మడి కర్నూలు జిల్లాలో వానలు కురవడం .. ముందస్తుగాను కర్షకలోకం ఖరీఫ్ సాగులో బాగంగా విత్తుకు పొలంబాట పట్టడం జరిగిపోయింది.. గతేడాది మిరుపను నమ్ముకున్న రైతులు నిండా మునిగిపోయ్యారు.. ఈ ఏడాది ఎర్రబంగారం వద్దు తెల్లబంగారం ముద్దు అంటూ పత్తిపంటవైపుకు ముందుకు ‘ సాగు’ తున్నారు. దీంతో ఏ పొలం చూసినా పత్తి విత్తు నాటుకుంటున్న కూలీలు కనిపిండం జరుగుతుంది.. జిల్లా పశ్చిమ బాగంలో అధికంగా పత్తిపంటవైపుకు అన్నదాత మొగ్గుచూపారనే చెప్పాలి.. రెండేళ్లుగా రైతు కష్టానికి తగ్గ పలితాలు రాలేదు.. ముందస్తు వానలతో పత్తి విత్తు అదునుగా భూమిలో పడిందని రైతన్న సంబరం పడుతున్నారు. దీంతో సకాలంలో వర్షాలు కురిసి పంటను వరుణదేవుడు ఆదుకుంటే ఈ ఏడాది దిగుబడులు పెరిగి రెండేళ్ళ చేసుకున్న అప్పులు తీరుతాయన్న ఆశలపల్లకిలో విత్తుపొలంలో పాతిపెట్టారు. మరోపక్క వాణిజ్యపంటలు సజ్జ, కొర్ర, కంది పంటను సాగుచేసేందుకు కొందరు రైత్తులు భూమిని సాగుచేసుకుని సిద్దంగా ఉంచుకున్నారు.

మిగతా 2లో

## రోగులకు మెరుగైన

# వైద్య సేవలు అందించాలి

- ఆసుపత్రిలో అదనపు పార్కింగ్ స్థలాలు గుర్తించండి
- రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్య,ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ.భరత్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు వైద్యులు,ఇతరఅధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధిపై వైద్య, మున్సిపల్, హార్టికల్చర్ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూకార్పొరేట్ స్థాయి ఆసుపత్రిగా కర్నూలు ఆసుపత్రిని

మిగతా 2లో



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

## పరిశ్రమల స్థాపనకు వీలుగా గడువులోపు

# అనుమతులు మంజూరు చేయాలి

- టమోటా ప్రాసెసింగ్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి
- కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** పరిశ్రమల స్థాపనకు వీలుగా నిర్దేశించిన గడువులోపు అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్

మిగతా 2లో

# ప్రజల గుండెల్లో మా అభివృద్ధి పదిలం

- మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- చేతకాని అధికారులతో పాలిస్తున్నారు..
- రేకుల షెడ్‌కు, పఫ్ షీట్‌లకు తేడా తెలియదు మీకు..
- ఏడాదిగా కుర్చీలు వేయలేకపోయారు.. అభివృద్ధిని అడ్డుకోకండి..
- చెరువులకు నీళ్లు నింపింది మేమే.. మీరు చేస్తుంది లష్కర్ పని మాత్రమే..
- ఎమ్మెల్యే కోట్ల పాలనపై బుగ్గన చురకలు..



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన

**డోన్ రూరల్ మేజర్ న్యూస్ :** డోన్ నియోజకవర్గంలో తాము చేసిన అభివృద్ధి పనుల బండలపై పేర్లు తుడవడం ద్వారా టీడీపీ నాయకులు పైశాచిక ఆనందం పొందుతున్నారని కానీ ప్రజల గుండెల్లో పదిలంగా ఉన్న తమ అభివృద్ధిని,ప్రేమను తుడవలేరని మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

మిగతా 6లో

# ఖరీఫ్ సాగులో కర్షకలోకం

(మొదటి పేజి తరువాయి)

మృగశిర, ఆరుద్ర కార్తుల్లో పంటలకు అనువుగా ఉంటుందని నాటికి వర్షాలు అనుకువగా కురిస్తే ఇక రైతులకు తీసికబురే అని చెప్పవచ్చు.. మంత్రాలయం, నందవరం ప్రాంతాల్లో పత్తిసాగులో కర్షకులు నిండా మునిగి పొయ్యారు.. తుంగభ ద్ర నదిలో ప్రవహిస్తున్న వరదనీరు ఇక్కడి రైతాంగాన్ని ఊరడిస్తుంది.. వానలు రాకున్నా ఎత్తిపోతల పథకాలు సాగునీరు అందిస్తాయన్న ధైర్యం వారిలో ఉంది.. ఇకపోతే మందుగా కురిసిన వానలకు తుంగభద్రమ్మ పరవళ్లు తొక్కుతున్న వేళ తీరం వెంటఉన్న కౌతాళం, కోసిగి, మంత్రాలయం, నందవరం, సి.బెళగల్ ,గూడూరు మండలాల్లో వరినారు పెంచడానికి ఎందో ఉపయోగ కరంగానీరు అందుతున్నాయి.. ఈ నేపద్యంలో వరినార పెంపుకు రైతులు సిద్ధం అయ్యారు. మిరుప పంట నేటికి శీతల గోదాముల్లో మగ్గపోతున్నా ధరలు వెక్కిరిస్తున్న నేపద్యంలో ఈ ఏడాది రైతులు మిరిప పంటవైపుకు మక్కువ చూపడంలేదనే తె లుస్తుంది.. కానీ పెద్దకడుబూరు, కోసిగి, నందవరం మండలల్లో కాస్తా మిరుప పంటకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో గతేడాదికంటే మిరుప సాగు గననీయంగా తగ్గే పరిస్థితులు ఉన్నాయి.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

(మొదటి పేజి తరువాయి)

అభివృద్ధి చేయడానికి ప్రజలకు సేవలందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమస్యలను తెలియజేస్తే వెంటనే సిఎం చంద్రబాబు నాయుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. అత్యవసర ప్రాంతాల నుండి వార్డులకు, ఇతర క్లిష్టమైన ప్రాంతాలకు ట్రాలీలు, వీల్ చైర్‌ల కదలిక కోసం ప్రత్యేకంగా అంతర్గత రోడ్లను మెరుగు పరచడానికి సూచనలు జారీ చేశారు. ఆసుపత్రిలోకి రావడానికి రెండవ గేటును తెరవడానికి, దానిని త్వరలో అందుబాటులోకి తీసుకురావడానికి వాహనాలు, రోగుల స్వేచ్ఛ ప్రవాహానికి లోపలికి, బయటకు ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని ప్రాంతాల్లో సిసి టివి కెమెరాలు పనిచేస్తున్నాయని నిర్ధారించుకోవడానికి క్లిష్టమైన ప్రాంతాల్లో అవసరమైతే కెమెరాలు కొనుగోలు చేయాలన్నారు. అన్ని ఐసియు, ఓటిలు, వెంటిలేటర్లు వంటి క్లిష్ట పరికరాల్లో యుపిఎస్ జనరేటర్, ఇన్వర్టర్ సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. ఎంసిహెచ్ బ్లాక్‌లో కఠిన సందర్శకుల విధానాన్ని ప్రారంభించాలన్నారు. పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా హాస్పిటల్‌లోని లేఔట్ ప్రకారం ప్రణాళిక బద్ధంగా మొక్కలను నాటేలా చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ అధికారులకు సూచించారు. అలాగే ఆసుపత్రిలో అదనపు పార్కింగ్ స్థలాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటర్ సింధూ సుబ్రమణ్యం, మున్సిపల్ కమీషనర్ రవీంద్ర బాబు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ, హార్టికల్చర్ ఏడి విజయలక్ష్మి, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం – మంత్రి బి.సి



అర్జీలను స్వీకరిస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యం ఇస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారంనాడు బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో వారు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఒక్క బనగాన పల్లె నియోజకవర్గం నుండే కాక నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం మంత్రి బి.సికి వినతీపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యాన్ని ఇస్తున్నామని అన్నారు. వచ్చిన అర్జీలలో కొన్నింటికి వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వార ఆదేశాలు జారీ చేశారు. అర్జీలన్నింటిని ఆయా శాఖల అధికారులకు పంపించి వారి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి బి.సి తెలిపారు.

# ప్రశ్నార్థకంగా మారిన గిరిజనుల జీవితాలు

(మొదటి పేజి తరువాయి)

భూమికి సాగునీరు రావడం గగనంగా తయారైంది. గిరిజనులు తమ పొలాలను బీళ్లుగా ఉంచుకున్నారు. అయితే రెండు సంవత్సరాల క్రితం స్వచ్ఛంద సంస్థ ఈ భూములలో కొన్ని బోర్లు వేసి సాగునీరు అందించాలని భావించారు. గిరిజన గూడెంలో 10 బోర్లు వేసినప్పటికీ రెండు బోర్లు మాత్రమే 2 నుంచి 3 ఇంచుల నీరు పడింది. సోలార్ ప్యానల్ల ద్వారా డ్రిప్ సిస్టమ్ ఉపయోగించి నీరు అందించే ప్రయత్నం చేశారు. అందులో భాగంగానే అక్కడ మామిడి మొక్కలు, ఇతర మొక్కలను నాటారు. అయితే ఈ బోర్లల్లో నీరు తగ్గిపోవడంతో మామిడి మొక్కలకు సక్రమంగా నీరు సరఫరా కావడం లేదు. దీంతో మామిడి మొక్కలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.

**తెలుగుగంగ నీరు అందేనా..?** : గిరిజన తాండాలలోని భూములకు పుష్కలంగా సాగునీరు అందాలంటే పక్కనే ఉన్న తెలుగు గంగ నీరే శరణ్యమని గిరిజనులు తెలుపుతున్నారు. నారపురెడ్డికుంట గిరిజన గూడెంకు కిలోమీటర్ దూరంలో తెలుగుగంగ ప్రధాన కాలువ ప్రవహిస్తోంది. ఇక్కడ విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసి సాగునీటిని పంపింగ్ చేయాలని కోరుతున్నారు. ఈ విధంగా ఒక కిలో మీటర్ పైపులైన్ ఏర్పాటు చేస్తే తమ పొలాలు సస్యశ్యామలంగా మారుతాయని గిరిజనులు తెలుపు తున్నారు. ఈ క్రమంలో అధికారయంత్రాంగం కృషి చేయాలని వారు కోరుతున్నారు. ఎన్నో సంవ త్సరాల నుంచి అధికారులకు తమ సాగునీటి సమస్యను తెలుపుతున్నప్పటికీ


ఎండిపోయిన మామిడి మొక్కలను చూపిస్తున్న గిరిజనుడు

ఎవరూ పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన తెలుపుతున్నారు. ఈ క్రమంలో ఉపాధి లేకపోవడంతో గిరిజనులు అడవిలోకి వెళ్లి వెదురు బొంగులను తెచ్చుకొని జీవనం సాగిస్తున్నారు. మరికొందరు ఉపాధి పనులకు వెళ్లి వచ్చిన కూలీ డబ్బులతో అతి కష్టం మీద కుటుంబాలను నెగ్గుకొస్తున్నామని మేజర్ న్యూస్ ద్వారా తెలిపారు.

**అవసరం లేని చోట చెక్ డ్యామ్‌ల నిర్మాణం** : నారపురెడ్డికుంట గిరిజన గూడెంలలో అవసరంలేని చోట చెక్ డ్యామ్‌లు చేపట్టారని గిరిజనులు తెలుపుతున్నారు. చెరువుకుపై భాగంలో కొండ వాగు ప్రవహిస్తుంది. ఈ నీరు చెరువులోకి మళ్లించే ప్రయత్నం అధికారులు చేపట్టలేకపోయారు. గతంలో చెరువులపైగా చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టాలని తొలుత పనులు చేపట్టారు. ఆ తరువాత పనులను నిలిపి వేసి అక్కడ నిర్మించాల్సిన చెక్ డ్యామ్‌ను చెరువు కింది భాగంలో నిర్మించడంతో ఉపయోగకరంగా లేదని గిరిజనులు తెలిపారు. నల్లమల కొండల్లో పడే వర్షపు నీరు చెరువులోకి రావడంలేదని, అధికారుల తప్పిదం వలన చెరువు నిండే మార్గంలేకపోయిందని అన్నారు.

**సాగునీరు అందిస్తేనే తమ బ్రతుకులు బాగు – గుళ్ల భయ్యన్న, నారపురెడ్డికుంట గిరిజనుడు:** గిరిజనుల బ్రతుకులు బాగుపడాలంటే సాగునీరు ప్రదేనాం. తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి సాగునీరు అందేలా చేయాలి. అప్పడే గిరిజనుల భూములు సాగులోకి వచ్చి రెండు పంటలు పండించుకోగలుగుతాం.


గుళ్ల భయ్యన్న

**ఎండిపోతున్న మామిడి మొక్కలు – గుళ్ల గొలసన్న, నారపురెడ్డికుంట, గిరిజనుడు:** సాగునీరు లేక ఇక్కడ నాటిన మామిడి మొక్కలు ఎండిపోతున్నాయి. ఇప్పటికే ఇక్కడ ఉన్న రెండు బోర్లల్లో ఒక్క బోర్లో మాత్రమే నీరు వస్తుంది. ఈ ఒక్క బోర్ ద్వారా మామి డి మొక్కలకు నీరు సరఫరా కావడంలేదు. దీంతో మొక్కలు ఎండిపోయాయి. ఏది ఏమైనా తెలుగుగంగ నీరు అందుబాటులోకి వస్తే బాగుపడతాం.


గుళ్ల గోలసన్న

# నూతన సీసీ రోడ్డును ప్రారంభించిన మంత్రి బి.సి

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె మండల పరిధిలోని నందవరం గ్రామంలో శుక్రవారంనాడు మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి నూతన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందవరం గ్రామంలో గొల్లపేట నందు 60లక్షల నిధులతో ఈ రోడ్డును డ్రైనేజిలను ఏర్పాటు చేయడం జరిగిందని గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ రోడ్డు నిర్మించాల్సి ఉండగా తరువాత ప్రభుత్వం మారడంతో పట్టించుకునే వారే కరువయ్యారని గ్రామస్థుల కోరిక మేరకు 60లక్షల రూపాయల నిధులు కేటాయించి ఈ రోడ్డును నిర్మించడం జరిగిందని అన్నారు. ఇక్కడ సరైన రోడ్డు లేక గ్రామస్థులు నిత్యం అవస్థలు పడేవారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తుందని రాష్ట్రంలో గుంతలు లేని రహదారులను కూడా నిర్మించామని ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.డబ్ల్యు.ఎస్ ఎ.ఈ సాయిక్రిష్ణ, ఎంపిడిఒ రమణ, నందవరం ఆలయ ఛైర్మెన్ పి.వి కుమార్ రెడ్డి, పి.ఆర్.డి.ఈ నాగశ్రీనివాసులు, ని,ఆర్.ఎ.ఈ వెంకటరమణ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న దృశ్యం

# పరిశ్రమల స్థాపనకు వీలుగా గడువులోపు అనుమతులు మంజూరు చేయాలి

(మొదటి పేజి తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులకు అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు సంబంధించి 9దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటికి వేగవంతంగా అనుమతులు మంజూరు చేయాలని ఈఈని ఆదేశించారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయని కలెక్టర్ ఆరాతీశారు. ల్యాండ్ లెవెలింగ్, ముళ్ల పొదల తొలగింపు పూర్తయిందని, సోమవారం మెటీరియల్ వస్తోందని ఏపిఎంఐపి పిడి కలెక్టర్‌కు వివరించారు. ఉల్లి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు దేవనకొండ మండలం ఈదుల దేవరబండ గ్రామంలో 10ఎకరాలను కేటాయించడం జరిగిందని ఏపిఐఐసీ ఆధ్వర్యంలో ఇందులో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయడం జరుగుతోందని ఇందుకు సంబంధించిన చర్యలు త్వరితగతిన తీసుకోవాలని కలెక్టర్


పాల్గొన్న అధికారులు

ఏపిఐఐసి జడ్ఎంను ఆదేశించారు. అలాగే మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కూడా తగిన చర్యలు తీసుకోవాలని ఇండస్ట్రీస్ జీఎంను ఆదేశించారు. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రీయల్ హబ్‌కి నీటి సరఫరా పైప్‌లైన్ నిర్మాణపు పనులు ఎంతవరకు వచ్చాయని ఏపి ఐఐసిసి జడ్ఎంను అడిగి తెలుసుకున్నారు. 70శాతం పూర్తయ్యాయని జడ్ఎం వివరించారు. జూలై లోపు పైప్‌లైన్ నిర్మాణపు పనులు పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. దూపాడు–బేతంచెర్ల రైల్వే లైన్ ఏర్పాట్లు, భూసేకరణ చేయాలన్నారు. రైల్వే లైన్, నీటి పైప్‌లైన్, ఎయిర్‌పోర్టులు పరిశ్రమలకు కనెక్ట్ అయితే అభివృద్ధి వేగవంతం అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జైరాజ్ ఇస్పాత్, జియో మైసూర్, గ్రీన్ కో తదితర కంపెనీల ద్వారా స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ జిఎంను ఆదేశించారు. ఇందుకు సంబంధించి వారితో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పిఎం విశ్వకర్మ పథకానికి సంబంధించి 2135దరఖాస్తులను ప్రభుత్వానికి పంపడం జరిగిందని వీటి మంజూరు ప్రగతికి సంబంధించి చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ నీటి సరఫరాకు సంబంధించి ఎస్టిమేట్స్ వేయించాలని కలెక్టర్ కర్నూలు కమీషనర్‌ను ఆదేశించారు.

**రూ. 1.61కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఆమోదం** : పరిశ్రమలకు ప్రోత్సాహకాల్లో భాగంగా 24క్లెయిమ్‌లకు రూ. 1.61కోట్లకు ఆమోదం తెలపడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా పెట్టుబడి రాయితీ కింద 17క్లెయిమ్స్‌కు రూ. 1,57,50,166, వడ్డీ రాయితీ కింద ఒక క్లెయిమ్‌కు రూ. 13,813లు, విద్యుత్ ఖర్చు రీయింబర్స్‌మెంట్ కింద ఒక క్లెయిమ్‌కు సంబంధించి రూ. 36,663లు, సేల్స్ టాక్స్ రీయింబర్స్‌మెంట్ కింద 5క్లెయిమ్స్‌కు సంబంధించి రూ. 3,35,265లు పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద ఆమోదం తెలపడం జరిగిందన్నారు. కేటగిరిల వారిగా జనరల్ కేటాగిరీలకు 7, ఎస్‌సిలకు 15, ఎస్‌టిలకు 2 మొత్తం 24మందికి ప్రోత్సాహకాలు మంజూరు చేశామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ఇంచార్జ్ జిఎం అరుణ, కమీషనర్ రవీంద్రబాబు, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపి ఎంఐపి పిడి ఉమాదేవి, పొల్యూషల్ కంట్రోల్ బోర్డ్ ఈఈ కిషోర్ కుమార్‌రెడ్డి, ఐలా చైర్మన్ రామకృష్ణారెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఎస్‌సి,ఎస్‌టి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, జిల్లా దళిత్ ఇండస్ట్రీస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల కర్నూలు జిల్లా జట్టు విజయభేరి మోగించాలి



జర్నలిస్టులకు క్రీడా దుస్తులు అందచేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** గుంటూరులో ఆంధ్రప్రదేశ్ స్టేట్ అసోసియేషన్ ఆఫ్ జర్నలిస్ట్ ఆద్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు విజయభేరి మోగించి తిరిగి రావాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ ఆకాంక్షించారు. శుక్రవారం నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న శ్రీ గురుదత్త పాలిక్లినిక్‌లో జరిగిన కార్యక్రమంలో కర్నూలు జిల్లా క్రికెట్ జట్టు జర్నలిస్టులకు ఆయన క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో క్రికెట్ క్రీడకు అత్యంత ప్రాచుర్యం ఉందన్నారు. దేశంలో మారుమూల గ్రామాల్లో సైతం ప్రతి గల్లీలో క్రికెట్ క్రీడ కనిపిస్తుందని చెప్పారు. ఈ క్రీడలో క్రీడాకారులందరు సమిష్టిగా రాణిస్తేనే విజయం సాధ్యమవుతుందన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల గెలుపోటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తి అలవాటు పడుతుందన్నారు. ఇది జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు వెళుతున్న జిల్లా జర్నలిస్టుల జట్టుకు తనవంతు బాధ్యతగా క్రీడా దుస్తులను పంపిణీ చేశానని భవిష్యత్తులో కూడా వారికి తన సహకారం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జర్నలిస్టుల క్రికెట్ జట్టు మోహన్, వైస్ కెప్టెన్ చిరంజీవి, మేనేజర్ శివరాజ్ కుమార్, సభ్యులు స్నేహల్, రవికుమార్, శివ, సుదర్శన్, భూషణ్, అనిత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** విధుల్లో చేరినప్పటి నుంచి అహర్నిషలు పనిచేసే ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని ఎంపిడిఓ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్‌డిగా విధులు నిర్వహిస్తున్న పివీ సుబ్బరాయుడు పదవీ విరమణ వీడ్కోలు సమావేశంను శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపిపి తిప్పన్న, జడ్‌పిటిసి రంగనాథ్ గౌడ్, వైస్ ఎంపిపి పద్మనాభ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నంద్యాల జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు, గుట్టపాడు సర్పంచ్ మోహన్‌రెడ్డి, పాలకొలను సుధాకర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో చేసిన మంచి పనులు చిరస్థాయిగా ఉంటాయని మండలంలో నాలుగేళ్లుగా ఈఓఆర్‌డిగా తన సేవలను అందించి మండల అభివృద్ధికి గ్రామ పంచాయతీలలోని పంచాయతీ కార్యదర్శులతో, రాజకీయ నాయకులతో కలిసిపోయి పని చేశాడని పదవీ విరమణ తర్వాత ఆయురారోగ్యాలను ఆ దేవుడు ఆయనకు ప్రసాదించి మనశ్శాంతిగా ఉండాలని అన్నారు. అనంతరం సుబ్బరాయుడు, అతని



సుబ్బరాయుడు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

భార్యను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్ఐ సునీల్ కుమార్ వారి సిబ్బందితో కలిసి ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, వివిధ గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అత్త, భార్య పై ఎరుకల కొడవలితో భర్త దాడి

### ఇద్దరికి తీవ్ర రక్త గాయాలు..

### ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన బంధువులు ..

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల పరిది లోని కంభళదహల్ గ్రామానికి చెందిన మద్దికేరి జయంతిని భర్త ద్దికేరవేమారెడ్డి అలియాస్ వేమిరెడ్డి శుక్రవారం అత్త జయమ్మను భార్య మద్దికేరి జయంతిల పైనా నాదుర్భాషలాడుతూ ఎరుకలికొడవలితో దాడి చేయడంతో వారివురికి తీవ్రరక్తాగాయాలయ్యాయి. పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్ రెడ్డి,భాధితులు, బంధువులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కంభళదహల్ గ్రామానికి చెందిన మద్ధికెరి జయంతిని,ఆలూరు మండలం అంగస్కల్ గ్రామానికి చెందిన వేమిరెడ్డికి16సంవత్సరాల క్రితం పెద్దల సమక్షంలో వివాహం జరిగిందని వీరికి ఇద్దరు కుమారులు సంతానం కల్గిఉన్నట్లు తెలిపారు.సంసార విషయంలో భార్య భర్త ల మధ్య మనస్పర్ధలు రావడంతో జయంతి మూడు సంవత్సరాల నుండి తన పుట్టిన ఇంట్లో తన తల్లి దగ్గర ఉంటుందని, కుమారులు మాత్రం వేమిరెడ్డి దగ్గర ఉన్నట్లు తెలిపారు.ఆదోని కోర్టు నందు విడాకులు కోసం అప్లైచేసినారని అప్పటినుంచి ఫిర్యాదని భర్త ఫోన్లో చంపుతానని బెదిరిస్తూ. అక్రమ సంబంధం పెట్టుకున్నా వంటూ ఫోన్లో చంపుతానని అంటూ ఫోన్లో తరచుగా బెదిరించే వాడని తెలిపారు. శుక్రవారం ఉదయం ఫిర్యాది భర్త వేమిరెడ్డి కంభళదహల్ గ్రామంలోని ఫిర్యాదు అమ్మ ఇంటి వద్దకు వచ్చి తన వెంట తెచ్చుకున్న ఎరుకలకొడవలితో చంపాలని ఉద్దేశ్యంతో ఫిర్యాదిని ఫిర్యాదు తల్లినరికి తీవ్ర రక్తాగాయం చేసినాడని గాయాలు పాలైన వారు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ట్లు ఫిర్యాది మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్ రెడ్డి విలేకరులకు తెలిపారు.



అత్త, భార్యను ఎరుకలకొడవలితో దాడి చేసిన భర్త వేమిరెడ్డి

# రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి

### – ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ



ఎస్ఐతో మాట్లాడుతున్న జి రామకృష్ణ, నాయకులు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని పూడిచెర్ల నుండి కేతవరం మీదుగా గార్గేయపురం వరకు ఆగిపోయిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని, పరిశ్రమల కోసం పైనీటి పైపులైను ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులకు న్యాయపరమైన నష్ట పరిహారం చెల్లించాలని ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఏపి రైతు సంఘం ఆద్వర్యంలో తుడిచెర్ల మిట్ట దగ్గర జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుండి ఓర్వకల్లు పరిశ్రమల హక్కు కొరకు నీటిపైపులైన్ను గార్గేయపురం, కేతవరం, పూడిచెర్ల గ్రామాల మీదుగా వెళుతుందని ఎటువంటి భూ సేకరణ ప్రక్రియను పాటించకుండ రైతుల ఆమోదం లేకుండ విచ్చలవిడిగా భూములను తవ్వేసి పైప్‌లైన్ పనులను పూర్తి చేశారని ఇంతవరకు రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదని అలాగే పూడిచర్ల నుండి కేతవరం మీదుగా గార్గేయపురం వరకు అస్తవ్యస్థంగా మద్యలోనే ఆపేసిన రోడ్డు పనులను తిరిగి ప్రారంభించాలన్నారు. గతంలో రోడ్డు పనులను ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇచ్చిన ఇంతవరకు ఎటువంటి పనులు చేపట్టకుండ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సంఘటన స్థలానికి ఎస్ఐ సునీల్ కుమార్ తన సిబ్బందితో చేరుకుని సర్ధి చెప్పే ప్రయత్నం చేసే క్రమంలో తోపులాట చోటు చేసుకుంది. అనంతరం ఎస్ఐ మండల తహశీల్దార్ విద్యాసాగర్‌ను రాస్తారోకో దగ్గరికి పిలిపించగా పంచాయతీరాజ్ ఈఈతో తహశీల్దార్ తన చరవాణి ద్వారా సమస్య తీవ్రతను వివరించారని భూములను కోల్పోయిన వారికి ఏపిఐఐసి వారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు. ఈ కార్యక్రమంలో ఏపి వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, సిఐటియు మండల కార్యదర్శి శ్రీధర్, ఏపి రైతు సంఘం మండల కార్యదర్శి మధుసూదన్, ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, సుధాకర్, మల్లేష్, బుగ్గ రాముడు, రేమట సుబ్బరాయుడు, వెంకటస్వామి, గపూర్మియా, వెంకటరమణ, మద్దిలేటి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి – డాక్టర్ బ్రహ్మారెడ్డి




మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ వి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లో ఉన్న జెవివి కార్యాలయంలో కార్యకర్తల రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదిక కార్యకర్తలకు శాస్త్రీయ దృక్పథం ఎంతో అవసరమన్నారు. ప్రతి పౌరుడు రాజ్యాంగ హక్కులను తెలుసుకుని వాటిని కాపాడే ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు సురేష్ కుమార్ మాట్లాడుతూ మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు యువతను ప్రోత్సహించే విధంగా కమిటీలను సిద్ధం చేస్తున్నామన్నారు. విద్యార్థులకు వైజ్ఞానిక సదస్సులను ఏర్పాటు చేసి వారిలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, రాష్ట్ర నాయకులు డాక్టర్ కోటేశ్వరరావు, మీనా, వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటిని వృధా చేస్తే కొళాయి కనెక్షన్ తొలగింపు

### – కమీషనర్ రవీంద్రబాబు



కొళాయి కనెక్షన్‌లను తొలగిస్తున్న సిబ్బంది

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ :** నగరంలో తాగునీటిని ఎవరైనా వృధా చేస్తే సంబంధిత గృహ, వాణిజ్య కొళాయి కనెక్షన్ తొలగించడం జరుగుతుందని నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన ప్రకాష్ నగర్, సంకల్‌బాగ్, ధర్మపేట, బిర్లా కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రకాష్ నగర్ నందు మున్సిపల్ తాగునీటితో కొందరు రహదారులను శుభ్రం చేస్తుండడాన్ని గమనించిన కమీషనర్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత గృహాల ట్యాబ్ కనెక్షన్‌లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. దీంతో డిఈఈ మరోహర్ రెడ్డి తాగునీటిని వృధా చేస్తున్న ట్యాబ్ కనెక్షన్‌లను తొలగించారు. అదేవిధంగా కమీషనర్ పరిమళ నగర్, ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్న క్యాంటీన్‌లను పరిశీలించారు. ఆహార నాణ్యత ప్రమాణాలు, శుభ్రత పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నగర ప్రజల కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి నీటిని శుద్ధి చేసి ప్రజలకు అందిస్తున్నామని అయితే దీనిని కొందరు ఇంటి అవసరాలకు వినియోగించుకోకుండ వాహనాలను, రహదారులను శుభ్రం చేయడానికి, గార్డెనింగ్‌లకు వాడడం మంచిది కాదన్నారు. ఇది ఏమాత్రం సబబు కాదని, వాటికి ఇతర నీటిని వినియోగించుకోవాలని సూచించారు. నగరంలో వేసవి తీవ్రత ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని కొన్ని ప్రాంతాల్లో రెండు,మూడు రోజులకు నీటిని అందించిన దాఖలాలు సైతం ఉన్నాయన్నారు. నీరు ప్రాణాధారమని, వాటిని వృధా చేస్తే బావితరాలకు కన్నీరే మిగులుతాయన్నారు. ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఈఈ మనోహర్‌రెడ్డి, పారిశుద్ధ్య తనిఖీదారుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### – ఎస్పీ విక్రాంత్ పాటిల్



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** సైబర్ నేరాల బారిన పడకుండ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ నూతనంగా శ్రీకారం చుట్టిన నేను సైబర్ స్మార్ట్ కార్యక్రమంపై వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పోలీసు అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకూడదని లఘు చిత్రాలతో పట్టణాలు, గ్రామాల లోని ప్రధాన కూడలిలో ప్రజలకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 38పోలీస్‌స్టేషన్ పరిధులలో మొత్తం నేను సైబర్‌స్మార్ట్ అవగాహన కార్యక్రమాలు 1680నిర్వహించినట్లు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాలలో 1,28,068 మంది ప్రజలకు సైబర్ నేరాల బారిన పడకూడదని అవగాహన కల్పించామన్నారు.

# ఎమ్మిగనూరు మున్సిపాలిటీ స్పెషల్ గ్రేడ్ స్థాయి చేరుకోవడం పై హర్షం..!



చైర్మన్, కమిషనర్‌కు సన్మానిస్తున్న కౌన్సిల్ సభ్యులు




హిందూ స్మశాన వాటిక భూమిని కాపాడాలంటూ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు మున్సిపాలిటీ 1965లో గ్రేడ్ – 3 నుండి అంచెలంచెలుగా 2025 నాటికి స్పెషల్ గ్రేడ్ స్థాయి చేరుకోవడంతో చైర్మన్‌తో పాటు కౌన్సిల్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం జరిగిన సాధారణ సమావేశంలో ఛైర్మన్ కె యస్ రఘు, కమీషనర్ గంగిరెడ్డి లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 మార్చి నెలలో, 2024 లో 2025 ఫిబ్రవరి నెలలో వైసీపీ పాలక వర్గం పురపాలక సంఘం స్థాయికి ఆమోదం తెలుపుతూ ప్రతి పాదనలు సిద్ధం చేసిందని, అందుకు కృషి చేసిన ఛైర్మన్, కమీషనర్ ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంజెండాలోని అన్ని అంశాలను ఆమోదించారు. అలాగే హిందూ స్మశాన వాటికలోని సర్వే నం. 183/ఏ 17వ వార్డు ప్రజల విజ్ఞప్తి మేరకు రోడ్డు కొరకు 2023 లో కౌన్సిల్ తీర్మానం చేశామే తప్ప 22 హిందూ కులాలకు తాము వ్యతిరేకం కాదన్నారు. ఈ సమయంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు మున్సిపల్ అభివృద్ధి కి అప్పటి బివి మోహన్ రెడ్డి నుండి ఇప్పటి జయనాగేశ్వర రెడ్డి వరకు కట్టుబడి ఉన్నారనీ గుర్తుచేశారు. ఇక శాశ్వత తాగునీటి పథకాని కి రూ.157 కోట్ల నిధులు మంజూరు ఉత్తర్వులు కూడా తెచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ఇక హిందూ స్మశాన స్థలం కబ్జా విషయం లో అప్పటి ప్రజా ప్రతినిధులు, పురపాలక పాలక వర్గం అధికారులు రూ. 9 లక్షలు అప్పణంగా పుచ్చుకోని అంజెండాలోని ఉంచి తీర్మానం చేశారని అన్నారు. అందుకు వైస్ చైర్మన్ స్పందించి లేని పోని ఆరోపణలు తమ పార్టీ పై వేయరాదనీ చేతనైతే నిరూపించాలని డిమాండ్ చేశారు. అందుకు ఇరువురి మధ్య వాగ్వివాదం తీవ్రంగా చోటు చేసుకుంది. అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అందుకు కమీషనర్ సమాధానం ఇస్తూ నిజానికి 17 వార్డు ప్రజల విజ్ఞప్తి మేరకే తీర్మానం జరిగిందని ప్రస్తుతం ఆ విషయం కోర్టులో ఉందనీ కోర్టు ఆదేశాలు ఎమ్మెల్యే సూచనల మేరకు ముందుకు వెళ్తామన్నారు. 28 వార్డు కౌన్సిలర్ బజారి మాట్లాడుతూ ఇరు పార్టీల సభ్యులు పరస్పరం ఆరోప ణలు, విమర్శలు తప్ప ఇతర సభ్యుల వార్డు సమస్యలు చర్చించే అవ కాశం లేదనీ, దాదాపుగా నాలుగున్నర సంవత్సరాలుగా తన వార్డు లో 200 గృహాలకు తాగునీరు, మౌళిక వసతులు కొరకు అధికారులను విన్నవిస్తున్నప్పటికీ స్పందించడం లేదనీ ఆక్రోషించారు. ఇక 23 వార్డు కౌన్సిలర్ డిష్ కేశవ రెడ్డి మాట్లాడుతూ తన వార్డులో తాగునీటి సమస్య, రోడ్లు ఛిద్రం అయి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడన్నాడు ఏనాడు అధికారులు, పాలక వర్గం కూర్చుని అభివృద్ధి పై చర్చించిన ధాఖాలాలు లేవన్నారు. 2వ వార్డు కౌన్సిలర్ అంపమ్మ మాట్లాడుతూ అభివృద్ధి అంటే కేవలం పేపర్లు, సన్మానాలకేనా..? పనులు చేసేది ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. చిన్న రోడ్డు వేయమని అడుగుతూ ఉన్నా మా వినతులు కమీషనర్ ఛాంబర్ దాటి బయటకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కమీషనర్ సమాధానం ఇస్తూ 17 వార్డు ప్రజల విజ్ఞప్తి దృష్టిలో ఉంచుకుని అజెండాలో ఉంచామనీ, ఎవరి ప్రయోజనాలు ఆశించి కాదన్నారు. అన్ని వార్డుల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, ఛైర్మన్ సూచిన మేరకే ముందుకు సాగుతున్నామన్నారు. కమీషనర్ గంగిరెడ్డి, డీఈఈ రాజు నాయక్, విక్టర్ పాల్, ఏఈ శరత్ చంద్ర, మదన్ టౌన్ ప్లానింగ్ అధికారి రాజేష్, అకౌంట్స్ ఆఫీసర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్‌ను వెన్నుపోటు పొడిచి బాబు రాజకీయాల్లోకి వచ్చారు

- సూపర్‌సిక్స్ అమలు కనుమరుగు
- దేవాలయాల భూముల లీజుపై బిజెపి స్పందించాలి
- వైకాపా జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్‌రెడ్డి




మాట్లాడుతున్న వైకాపా జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్‌రెడ్డి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండ కూటమి ప్రభుత్వం కాలాన్ని సాగుదీస్తుందని, పిల్లనిచ్చిన మామ ఎన్‌టిఆర్‌నే వెన్నుపోటు పొడిచి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాడని వైకాపా జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని ఎస్‌వి కాంప్లెక్స్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో వైకాపా కార్పొరేటర్లతో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల భూములను కొల్లగొట్టేందుకు కూటమి ప్రభుత్వం చీకటి జీఓలను తీసుకొస్తున్నారని అన్నారు. ఈ చీకటి జీఓలను వైకాపా తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎండోమెంట్ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఎలాంటి హక్కు లేదని కూటమి ప్రభుత్వం చేస్తున్న ఇలాంటి దుశ్చర్యలను ప్రతిఒక్కరు ఎండగట్టాలన్నారు. దేవాలయ భూములను కూటమి నేతలు పప్పులు, బెల్లం మాదిరిగా పంచుకుంటే తాము చూస్తూ ఊరుకోమన్నారు. క్యాబినెట్‌లో ఈ నిర్ణయాన్ని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ వ్యతిరేకించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యమైన బిజెపి నేతలు దేవాలయాల భూముల లీజులపై స్పందించాలన్నారు. దేవుడికి ద్రోహం చేసేందుకు చంద్రబాబునాయుడు ప్రభుత్వం కుట్రలు చేస్తుందని దీనిని న్యాయ పోరాటం చేసి దేవాలయాల భూములకు అండగా నిలుస్తామన్నారు. కడపలో జరిగిన మహానాడు కేవలం జగన్‌పై విమర్శలు చేసేందుకు మాత్రమే పరిమితమైందన్నారు. పేద ప్రజలకు ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స పథకాలు అమలు చేస్తామని ఓట్లు వేయించుకుని గద్దెనెక్కినాక అమలు చేయడం మరిచారన్నారు. దేవాలయ భూముల పరిరక్షణ కోసం హిందూ ధార్మిక సంఘాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## చౌక దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ

### – ఆర్డీఓ విశ్వనాథ్

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు రేషన్ పంపిణీ ఎండియు వాహనాల వ్యవస్థను రద్దు చేసిన నేపథ్యంలో జూన్ 1వ తేదీ నుంచి యథావిధిగా చౌకదుకాణాల వద్ద కార్డుదారులకు నిత్యావసర వస్తువులు అందించాలని, ఇకపై రేషన్ దుకాణాల పూర్తి బాధ్యత డీలర్లదే అని ఆర్డీఓ విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక రూరల్ ఎంఆర్ఓ కార్యాలయంలో రూరల్ పరిధిలోని రేషన్ డీలర్లతో రూరల్ ఎంఆర్ శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రేషన్ డీలర్లు ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులను గతంలో మాదిరిగానే రేషన్ దుకాణంలో పంపిణీ కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. జూన్ 1వ తేదీ నుంచి మొదలయ్యే పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో మొదలుపెట్టే విధంగా రేషన్ దుకాణాలను కొబ్బరిమట్టలు, మామిడి తోరణాలు, పూల అలంకరణలతో అందంగా అలంకరించి ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో రేషన్ పంపిణీని ప్రారంభించాలని తెలిపారు. రూరల్ ఎంఆర్ఓ శ్రీనివాసులు మాట్లాడుతూ రేషన్ దుకాణాల వద్ద కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజలకు ఆమోదయోగ్యంగా, ఆనందంగా ఉండేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థపై ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు, సమస్యలు రాకుండా చూడాలని తెలిపారు. దుకాణాల వద్ద బోర్డు, ధరల పట్టిక, స్టాక్ వివరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్డుదారులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా మంచి వాతావరణంలో పంపిణీ జరిగేలా డీలర్లు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఆచారి, సిఎస్‌జిటి ప్రసాద్, ఏఎస్ఓ, డిప్యూటి తహశీల్దార్ రామచంద్రరావు, రేషన్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ విశ్వనాథ్

## కుక్కల బెడదతో నిత్యం వ్యథ..

### కుక్కల దాడులతో హడలుతున్న పుర ప్రజలు



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** నంద్యాల పురపాలక సంఘ పరిధిలో కుక్కల బెడద రోజు రోజుకు పెరిగిపోతుంది. రోజూ పట్టణంలో ఎక్కడో చోట కుక్కల దాడులు జరుగుతూనే ఉన్నాయి. శుక్రవారం ఒక్క రోజే పట్టణంలోని పలు వీదు లలో శునకాలు స్వైర విహారం చేసి పలువురిని కరిచాయి. వీరంతా ప్రభుత్వ ఆసు పత్రి లో చికిత్స పొందారు. పట్టణంలోకుక్కల బెడద అధికమవుతున్నా నిబంధనల పేరుతోవాటిపై చర్యలు తీసుకోవడంలో అధికారులుతాత్సారం చేయడంతో కుక్కల కాటుకు మరింతమంది బలవుతున్నారు. కుక్కల సమస్యపై కౌన్సిల్‌సమావేశంలో అనేక సార్లు ఫిర్యాదులు చేసినాప్రయోజనం లేదంటూ కౌన్సిలర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు కుక్కల దాడులు అరికట్టడంపై ప్రత్యేక దృష్టిసారించి వాటి బారి నుండి కాపాడాలంటూ పుర ప్రజలు కోరుతున్నారు.

## వాము క్వింటం రూ.17,066లు

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్ :** కర్నూలులోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు వివిధ రకాల పంట ఉత్పత్తులు తీసుకొచ్చారు. శుక్రవారం వాము క్వింటం ధర రూ. 17,066 లు పలికింది. వేరుశనగకాయలు క్వింటం ధర రూ. 6699లు, కందులు క్వింటం రూ. 6619లు, మిర్చి ఎరుపు క్వింటం రూ. 5999లు, శనగలు క్వింటం రూ. 3000లు పలికింది. రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధరలను కల్పించింది.

## పేదలకు అండగా సిఎం సహాయ నిధి

### – మంత్రి టీజీ భరత్



లబ్ధిదారులకు చెక్కులను అందచేస్తున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలను ఆదుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఆయన కార్యాలయంలో నలుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను అందచేశారు. పోడూరి లలిత అనే మహిళకు రూ. 1,48,327లు, దినేష్ కుమార్‌కు రూ. 2,64,008లు, సయ్యద్ అంజాద్ బాషాకు రూ. 45,700లు, పూజారి జయలక్ష్మికి రూ. 15వేల చెక్కులను మంత్రి టీజీ భరత్ అందచేశారు. ఆపద సమయంలో నియోజకవర్గ ప్రజలను ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంత్రి టీజీ భరత్ కృతజ్ఞతలు తెలిపారు. చెక్కులు అందుకున్న వారు సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి టీజీ భరత్‌ల మేలు మరిచిపోలేమని సంతోషం వ్యక్తం చేశారు.

## నిత్యం కరెంటు కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు



**పాణ్యం, మేజర్‌న్యూస్ :** మండలంలో నిత్యం కరెంటు కోతలతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరుచూ విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో చిన్న పరిశ్రమలు, గృహ వినియోగదారులు, వ్యాపార సంస్థలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నట్లు విద్యుత్ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ కోతలతో ప్రభుత్వ కార్యకలాపాలు ఆటంకం కలుగుతున్నట్లు ఆయా కార్యాలయాల సిబ్బంది చెబుతున్నారు. చిన్న పరిశ్రమలైన జీరాక్స్ సెంటర్లు, కూల్‌డ్రింగ్స్, వెల్డింగ్, పిండి మిషన్, జ్యూస్, హోటళ్ళు, వడ్రంగి, రైస్ మిల్లులు, పాలీస్ బండల ఫ్యాక్టరీలు, కంకర మిషన్లు, పెట్రోల్ బంక్‌లకు విద్యుత్ అంతరాయం సమస్యగా మారింది. విద్యుత్ కోతలు పరిశ్రమలపై తీవ్ర ప్రభావం చూపడంతో వినియోగదారులు విద్యుత్ శాఖపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ నిమిత్తం వారంలో ఒక రోజు విద్యుత్ కోత అధికారికంగా ప్రకటించినా మళ్లీ సమస్య మొదటికి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ సరఫరాలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి వచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏబీ స్విచ్‌ల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామాల్లో ఒక ప్రాంతంలో విద్యుత్ సమస్య తలెత్తితే గ్రామం మొత్తం చీకటిలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మెయిటెనెన్స్ సమయంలో ప్రధాన సమస్యలను గుర్తించడంలో విద్యుత్ సిబ్బంది విఫలమవుతు న్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భవిష్యత్తులోనైనా ఇలాంటి సమస్యలు ఎదురు కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా వేదిక

● ఎమ్మెల్యే గిత్త జయసూర్య

**పాములపాడు మేజర్ న్యూస్ :** గ్రామాల్లో ప్రజా సమస్యలు తీర్చేందకే మండలంలోని వివిధ శాఖల అధికారుల సమన్వయంతో, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. శుక్రవారం పాములపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారిక వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఈ కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరగా పురోగతి సాధించాలని అధికారులను ఆదేశించారు లబ్ధిదారులని ఉద్దేశించి మాట్లాడుతూ అర్జీదారులు సమస్య పరిష్కారం అయ్యేంతవరకు సంబంధిత అధికారుల వద్ద ఫోటోలు దిగవద్దని సూచించారు గ్రామాల వారిగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు మండల కేంద్రంలో టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని అలానే పొలాలకు వెళ్లే అధ్వానంగా ఉన్నాయని వాటికి మరమ్మతులు చేయాలని అదేవిధంగా గ్రామంలో ఒకటే నీటి ట్యాంక్ ఉందని ఇంకోటి కూడా కావాలని సర్పంచ్ మేకల భాగ్యమ్మ కోరారు ఎమ్మెల్యే జలజీవన్ ద్వారా ఒక ట్యాంక్ నిర్మిస్తామని తెలిపారు టాయిలెట్లు పనులు ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులకు 15 రోజుల్లో పనులు ప్రారంభం కావాలని ఆదేశించారు వాడాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో 18 రోజుల నుండి కుళాయిలకు నీరు రావడంలేదని పంచాయతీ కార్యదర్శికి చెప్పిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు ఎమ్మెల్యే వెంటనే పంచాయతీ కార్యదర్శి పై 18 రోజుల నుంచి నీరు రాకుంటే ఏం చేస్తున్నావు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు ఇస్కాల గ్రామంలో తాగునీటి సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ను పంచాయతీ అధికారులు మరమ్మతులు చేయించి దాని ద్వారా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు కంబాలపల్లె ఇస్కాల గ్రామాల మధ్యన ఉన్న భవనాసి వాగుపై వంతెన నిర్మాణం చేయాలని గ్రామస్తులు నాగలక్ష్మి రెడ్డి కోరారు వచ్చిన దరఖాస్తులన్నీ పరిశీలించి త్వరగా పనులు చేయాలని అధికారులను ఆదేశిం చారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సుభద్ర మ్మ,, అడ్మినిస్ట్రేషన్ అధికారి గాయత్రి పిఆర్ డిఈ ధని బాబు వ్యవసాయ అధికారి పనిశ్వర్ రెడ్డి, ఏటీఎం ఉమామహేశ్వరి, ఏపీవో అలివేలు మంగమ్మ, నాయకులు ఎంపీపీ తోగూరు సరోజిని వర్జినయ్య , సర్పంచులు మల్లేశ్వర్ రెడ్డి, ప్రసాద్ రావు, మాణిక్యమ్మ,చెల్లె హరినాథ రెడ్డి, రాయపాటి గోవిందు, లక్ష్మీకాంతరెడ్డి, పూసల కృష్ణ,, వెంకటేశ్వరొండ్డి, నబి రసూల్ , ఉపేంద్ర, మోహన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

# గ్రామీణ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకే ఉచిత శిక్షణ

– ఇన్‌కమ్ ట్యాక్స్ అడిషనల్ కమీషనర్ బి యాదగిరి

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్ :** విద్యార్థుల్లో ఆంగ్ల భాష పట్ల భయాన్ని పోగొట్టి ఆత్మస్థైర్యంతో జీవితంలో ముందడుగు వేసేలా పినాక ఉచిత శిక్షణ తరగతులు రూపొందించిందని హైదరాబాద్ ఇన్‌కమ్ ట్యాక్స్ అడిషనల్ కమీషనర్ బి యాదగిరి అన్నారు. గత 10రోజులుగా నగరంలోని శ్రీలక్ష్మి హైస్కూల్‌లో పినాక ప్రజా సాధికార ట్రస్టు ఆద్వర్యంలో బి యాదగిరి, అమీలియో ఆసుపత్రి అధినేత డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ నేతృత్వంలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్ నిర్వహిస్తున్న పినాక ఉచిత శిక్షణ తరగతులకు ఐఆర్ఎస్ అధికారి బి యాదగిరి హాజరై రెండ్రోజుల పాటు విద్యార్థులకు విద్యా బోధన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా రాయలసీమ అన్ని జిల్లాల్లో పినాక ఉచిత శిక్షణ తరగతులు వేసవిలో నిర్వహిస్తున్నామని ప్రతి సెంటర్‌లో వందమంది విద్యార్థుల వరకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, గ్రూప్స్, సివిల్స్, గైడెన్స్ కోర్సును మెటీరియల్‌తో కూడిన ఉచిత శిక్షణ మధ్యాహ్నం ఉచిత భోజన సదుపాయం, అమ్మాయిలకు హాస్టల్ వసతి కల్పిస్తున్నామన్నారు. గ్రామీణ విద్యార్థులకు ఆంగ్ల భాష పట్ల భయాన్ని పోగొట్టి ఆత్మస్థైర్యంతో ఆంగ్లభాషలో ఇంటర్వ్యూలను ఎదుర్కొనేలా వేదికలపై ప్రసంగించేలా ఈ శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు ఎక్సైజ్ శాఖ సిఐ మంజుల, శ్రీలక్ష్మి హైస్కూల్ డైరెక్టర్ దీక్షిత్, ఆర్‌విపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్, ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బలరాం, గణిత అధ్యాపకులు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.




ఐఆర్ఎస్ బి యాదగిరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

# తేదేపాది మహానాడు కాదు మాయనాడు

- ఏడాదిగా ప్రజలను మాయచేస్తున్న కూటమి పాలన
- జగన్నామస్మరణ తప్ప సూపర్‌సిక్స్ పై మాట లేవి..?
- జూన్ 4వతేదిన వెన్నుపోటు దినం విజయవంతం చెయ్యాలి
- వైకాపా నాయకులు బుట్టా, ఎర్రకోట, రుద్రగౌడుల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న బుట్టా

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** ఏడాది పాలనలో ప్రజలకు చేసింది చెప్పుకోలేక కడప గడ్డపై మహానాడు అనే సభను పెట్టి మాయమాటలతో మభ్యపెట్టడమే కాక మూడు రోజులు కడప వేదికగా జగన్నామస్మరణ చేశారంటూ కర్నూలు పార్లమెంట్ మాజీ ఎంపి, ఎమ్మిగనూరు వైకాపా సమన్వయకర్త బుట్టారేణుక ఎద్దేవ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయం ఆవరణ ముందు పార్టీ ముఖ్యనాయకులతో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి పాలకులు ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలు ఆరంటే ఆరు అమలు పరచలేకున్నా మహానాడు అంటూ కడప గడ్డపై మూడు రోజులుగా జగనన్న నామం జపించారని దుయ్యబట్టారు. ఏడాదిగా సంక్షేమం అందించలేకున్నా ప్రజానాయకుడిపై విమర్శలు చెయ్యడం తప్ప టిడిపి నాయకులు చేసింది ఏమిలేదన్నారు. సంవత్సరం కాలంపాటు రాష్ట్ర ప్రజలను వంచనకు గురి చేసిన చంద్రబాబు పాలనను ప్రజలు గమనిస్తున్నారని దీనిని గుర్తుంచుకుని ముందు ఎన్నికల హామీలు నెరవేర్చకపోతే కూటమి ప్రభుత్వం భరతం పట్టడానికి ప్రజల తరుపున జగనన్న ఉన్నారన్నారు. ఇకనైనా జగనన్న జపం మానుకుని ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాన్ని పంచిపెట్టండి అని హితవు పలికారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా వచనచేయ్యడం మాత్రం మానుకోరన్నారు. ఇలా మరోమారు ప్రజలను ఏడాదిగా వంచనకు గురిచేసిన కూటమి పాలన కు కనువిప్పు కలగేలా జూన్ నెల 4వతేదిన వంచన దినంగా వైకాపా పోరుబాట పటబోతుందని జగనన్న పిలుపు మేరకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సైనికుడిలా కథం తొక్కాలంటూ బుట్టారేణుక, ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి, రుద్రగౌడులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైకాపా నాయకులు బుట్టా శివనీల కంఠప్ప, మున్సిపల్ చైర్మన్ కెఎస్ రఘు, మండల నాయకులు కృష్ణారెడ్డి, విరుపాక్షిరెడ్డి ముగతి, కౌన్సిలర్లు, వైకాపా వివిద విభాగాల కన్వినర్లు పాల్గొన్నారు.

# జాబ్ మేళాకు విశేష స్పందన




మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ శాఖ ఆద్వర్యంలో శుక్రవారం నిరుద్యోగ యువతీ, యువకుల కోసం రవీంద్ర మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ జాబ్ మేళా నందు 16 కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాకు దాదాపు 401మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొనగా వీరిలో 154మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పుల్లయ్య, ప్రిన్సిపల్ జ్యోతి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎల్ ఆనంద్ రాజ్ కుమార్, కళాశాల సిబ్బంది, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో రామన్నస్వామి ఆరాధన



భగవద్గీత పారాయణం చేస్తున్న స్వామి శిష్యులు

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో కుందూనది తీరాన వెలసిన అవదూత బొమ్మన వెంకటసుబ్బారెడ్డి స్వామివారి గురుదేవులైన వేదాంతం రామన్న స్వామివారి ఆరాధన కార్యక్రమం శుక్రవారం ఆశ్రమం వద్ద ఘనంగా నిర్వహించారు. జేష్టశుద్ధ పునర్వసు నక్షత్రంలో స్వామివారు ఉయ్యాలవాడలో బోయ కుటుంబంలో జన్మించారు. ఈ కులంలో జన్మించిన మహర్షి వాల్మీకి లాగా ఆధ్యాత్మిక మార్గంలో ఎంతో మంది శిష్యులకు బోధనలు చేసి వారికి మార్గదర్శకుడయ్యాడు. ఈ సందర్భంగా స్వామివారి సమాధి వద్ద శ్రీ వేణుగోపాల స్వామి ఆశ్రమ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆశ్రమ నిర్వాహకులు మహానంది స్వామి, నాగేష్ స్వామిలు పంచామృతాభిషేకాలు, సామూహిక భగవద్గీత పారాయణం ఏర్పాటు చేశారు. అనంతరం పాల్గొన్న భక్తులందరికీ రామన్న స్వామి వారసులు ఓబన్న నాయుడు దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

# ఘనంగా పెద్దగుమ్మడాపురంలో ప్రతిష్ఠ వేడుకలు



**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామంలో శ్రీ గణపతి, శివ, గౌరీ, నందీశ్వర, కుమారస్వామి, వీరభద్రస్వామి, విష్ణుమూర్తి ధ్వజసహిత కళశ ప్రతిష్ట వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజలతో ప్రారంభించి యంత్రాలకు అభిషేకాలు, ప్రతిష్ట హోమాలు, మూలయంత్ర హోమాలు నిర్వహించారు. అనంతరం గర్భగుడిలో శివలింగాలను, నూతన విగ్రహాలను ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్టించారు. ఆలయం ముందు ధ్వజస్తంభంను ప్రతిష్టించారు. ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ప్రతిష్ట అనంతరం బలిదానం, పూర్ణాహుతి, మహా మంగళ హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు శివలింగానికి కాయా కర్పూరం సమర్పించి పూజించారు. అన్నదానం నిర్వహించడంతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న పురోహితులు

సూర్య www.suryaa.com

శనివారం | 31 మే 2025

# పత్తి విత్తనాలను ఎంఆర్పి ధరలకు విక్రయించాలి

**-మండల వ్యవసాయ అధికారి.జి మల్లేష్ కుమార్**

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** ఎరువుల దుకాణ దారులు పత్తి విత్తనాలు ఎంఆర్పి ధరలకు మాత్రమే విక్రయించాలని ఏఓ మల్లేష్ కుమార్ సూచించారు.మండల పరిధిలోని కొత్తకోట మరియు స్థానిక సిబెళగల్ మండలంలోని ఎరువు, పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం డీలర్లతో మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, పురుగుమందులు



ఎరువులు దుకాణాలను తనిఖీ చేసిన ఏఓ మల్లేష్ కుమార్

ఎంఆర్పి ధరల కన్నా అధికంగా విక్రయించినట్లయితే వారి పైన కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు తప్పనిసరిగా కంప్యూటర్ బిల్లు, రసీదులు ఇవ్వాలని సూచించారు.ఓం శ్రీ నాగ సాయి ఏజెన్సీస్, శ్రీ లక్ష్మీ పెస్టిసైడ్స్ నందు స్టాక్ బోర్డ్స్ నిలువలను మరియు స్టాక్ రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. అదేవిధంగా ఎక్కడైనా లూజు పత్తి విత్తనాల అమ్మినట్లయితే అట్టి సమాచారం అందించాలని అట్టివారిపై కఠిన చర్యలు తీసుకోబడునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది మరియు డీలర్స్ సోదరులు పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో మా అభివృద్ధి పదిలం

(మొదటిపేజి తరువాయి..)

స్పష్టం చేశారు.అదే విదంగా డోన్ నియోజక వర్గంలో ఎమ్మెల్యే కోట్ల పాలనపై కూడా తనదైన శైలిలో విమర్శలు ఎక్కుపెట్టారు బుగ్గన. ఆమేరకు శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో పాత్రికేయులసమావేశంనిర్వహించారు.ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ పని తీరు పై ఆగ్రహం వ్యక్తంచేశారు. మున్సిపాలిటీకి చెందిన స్థలాలకు,రోడ్డు లకు అడ్డుగా కొంతమంది గోడలు కడుతుంటే ఆపలేకపోవడం పాలక పక్షం చేతకాని తనమన్నారు.కోట్ల రూపాయలు పెట్టి బీసీలకు గురుకుల విద్యాలయాలు,గొర్రెల శిక్షణ కేంద్రం లను తాము నిర్మిస్తే ఏడాదిగా వాటికి కుర్చీలు,టేబుల్‌లు ఏర్పాటు చేయలేకపోయారన్నారు. టెండర్లు పూర్తయిన ఎస్సీ గురుకులంను రద్దు చేయడం దుర్మార్గమన్నారు.టెండర్లు పూర్తయిన కాపు భవనం పనులు మొదలుపెట్ట లేదని తెలిపారు.రేకుల షెడ్ కు,అత్యాధునిక పఫ్ షీట్ లకు తేడా తెలియని వారుకుడా తమ అభివృద్ధిని విమర్శిస్తున్నారని మండిపడ్డారు.ఊరికి దూరంగా సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని చూసేది కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారుల లబ్ది కోసమేనని అన్నారు.తమ హయాంలోనే చెరువులకు నీళ్లు నింపితే టీడీపీ నాయకులు మాత్రం మళ్ళీ మళ్ళీ చెరువులకు నీళ్లొదిలి లష్కర్ పని చేస్తున్నారన్నారు.కొత్త పనులు దేవుడెరుగు తాము చేసిన పనులలో పెండింగ్ ఉన్న వాటిని పూర్తి చేయాలని కోరారు.కొంతమంది స్వార్థ పరుల కోసమే రైల్వే అండర్ బ్రిడ్జి పనులు మొదలు పెట్టడం లేదన్నారు.ఒకరు చేసిన పనులను తాము చేసామన్నట్టు చెప్పుకోవడం పక్కింటి పిల్లాడిని ముద్దులాడటం లాంటిదన్నారు.రాజకీయాలు ఒక సామాజిక బాధ్యత గా నిర్వర్తించాలే తప్ప వ్యాపారం కోసం కాదని కాసింత హుందాగా రాజకీయాలు చేయడం నేర్చుకోవాలని ఆయన టీడీపీ నాయకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు,ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి,జడ్పీటీసీ బద్దల రాజ్ కుమార్,మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెపల్లె రామచంద్రుడు,వైసీపీ మండల అధ్యక్షుడు సోమేశ్ యాదవ్,వైసీపీ జిల్లా వాలంటీర్ విభాగం అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్,ఆర్.ఈ రాజవర్ధన్,కౌన్సిలర్లు టి.ఈ దినేష్ గౌడ్,నాగేంద్ర, మహేశ్వర రెడ్డి, ఆర్ట్ రమణ,సుంకన్న,సుకన్య,మున్సిపల్ కో ఆప్షన్ మెంబెర్ కుమ్మరి రాజు,వైసీపీ మండల యువత అధ్యక్షుడు బుగ్గన జయచంద్ర రెడ్డి,పట్టణ యువత అధ్యక్షుడు చలం వంశీ తదితరులు పాల్గొన్నారు.

**వైసీపీ బలోపేతానికి కృషి చేస్తా.. :** డోన్ నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని వైసీపీ మండల యువత అధ్యక్షుడు బుగ్గన జయచంద్ర రెడ్డి స్పష్టం చేశారు. నూతనంగా వైసీపీ మండల యువత అధ్యక్షునిగా ఎన్నికైన బుగ్గన జయచంద్ర రెడ్డి శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో మాజీ ఆర్థికమంత్రి బుగ్గనను గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి,వైసీపీ మండల అధ్యక్షుడు సోమేశ్ యాదవ్,డి.గోపాల్ రెడ్డి,బొబ్బల శివరామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 12న నంద్యాల జిల్లాకు పిసిసి అధ్యక్షురాలు షర్మిలమ్మ రాక

**నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయండి..నంద్యాల డిసిసి అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ యాదవ్**



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :**జూన్12వ తేదీనంద్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీజిల్లాఅధ్యక్షుడు జంగిటిలక్ష్మినరసింహా యాదవ్ ఆధ్వర్యంలో జరిగే నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలమ్మ హాజరవుతున్నారని నంద్యాల డిసిసి అధ్యక్షుడు లక్ష్మి నరసింహ యాదవ్ శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. జూన్ 12 వతేదీ ఈ సమావేశం ఉదయం 9 గంటలకు నంద్యాల పట్టణములో సూరజ్ గ్రాండ్ హెూటల్ లో నిర్వహిస్తామని కావున కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు అందరు కూడా తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నంద్యాల డిసిసి అధ్యక్షుడు జె. లక్ష్మి నరసింహ యాదవ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని,ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఆంధ్రప్రదేశ్‌లో కూటమీ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యాయని రాష్ట్రములోరైతులు,పేదలు, నిరుద్యోగులు, సామాన్య మధ్య తరగతి వాళ్లు, ఉద్యోగులు అనేక మంది ఇబ్బందులకు గురి అవుతున్నారని, వీరి సమస్యలను పరిష్కరించడములో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ఈ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడానికి పిసిసి అధ్యక్షురాలు జిల్లాల పర్యటన చేపట్టిందని అందులో భాగంగా కార్యకర్తలను సిద్ధం చేయడానికి, వారికి భరోసా ఇవ్వడానికి జిల్లా కార్యవర్గ సమావేశాలకు హాజరు అవుతున్నారని తెలిపారు... కావున ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త హాజరై విజయవంతం చేయాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమం లో డోన్ నియోజకవర్గం ఇంచార్జి డాక్టర్ గార్లపాటి మద్దిలేటి స్వామి,శ్రీశైలం నియోజకవర్గం ఇంచార్జి ఇస్మాయిల్ నంద్యాల జిల్లా డిసేసి ఉపాధ్యక్షులు ఉన్నిగొర్ల జనార్దన్, హెచ్. బాలస్వామి,రాష్ట్ర బిసి సెల్ నాయకులు బోయ రమణ, డిసిసి ప్రధాన కార్యదర్శి రజాక్ తదితరులు పాల్గొన్నారు.

# వివాహానికి ఆర్థిక సాయం అందజేత

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల 38వ వార్డులో నివాసం ఉంటున్న పేద ముస్లీం టీడీపీ కార్యకర్త కుమార్తె వివాహానికి ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ తాటికొండ బుగ్గరాముడు ఆర్థిక సాయం అందజేశారు. రాష్ట్ర న్యాయ, మైనార్టి సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, రాష్ట్ర యువకులు ఎన్ఎండి ఫయాజ్ ఆదేశాల మేరకు వార్డులోని టీడీపీ సీనియర్ కార్యకర్త ఇమామ్ హుస్సేన్, రెహామున్నిసా దంపతుల కుమార్తె వివాహానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. వార్డులో వివాహం జరిగినా, మృతి చెందినా వారికి ఆర్థిక సాయంను మూడు సంవత్సరాలుగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక సాయం అందజేసిన ఒదుకు ఇమామ్ హుస్సేన్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటికొండ మహేష్ బాబు, చిన్నరాముడు, మోజేస్, తదితరులు పాల్గొన్నారు.




# కాళికామాత ఆలయంలో పూజలు



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** విశ్వరూపనగర్లో వెలసిన శ్రీ కాళికామాత దేవాలయంలో జేష్ఠ మాసం శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు విల్లనూరు చంద్రశేఖర ఆచారి ఆధ్వర్యంలోశ్రీకాళికాంబకు విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో శ్రీ చక్ర పూజలను, కుంకుమార్చన పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మహిళా కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# నిరుపయోగంగా డెయిరీ భవనం

**17.67 లక్షల రూపాయాలు వృధా**

**ఆళ్లగడ్డ , మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ మండలం ఆర్ క్రిష్ణాపురం గ్రామంలో డెయిరీ భవనం వృధాగా మారి శిధిలావస్థకు చేరుకుం టుంది. వైఎస్సార్సీపి ప్రభుత్వ హాయంలో 2023 లోరూ 17.67 లక్షల రూపాయలతో జగనన్న పాల వెల్లువ పేరుతో మహిళా డెలు రీ సహాకార సంఘంభవనంనిర్మించారు.గ్రామంలోని వివిధ ప్రాంతాల నుండి పాల సేకరణ, విక్రయాల నిర్వహించేందుకు మహిళల కోసం ఈ భవనాన్ని నిర్మించారు. అయితే గత కొన్ని రోజు లుగా నిరుపయోగంగా మారి శిధిలావస్థకు చేరుకుంటుంది. అధికారులు స్పందించి నిరు పయోగంగా ఉన్నభవనాన్ని వినియోగంలోకి తీసుకోనిరావాలనిగ్రామప్రజలు కోరుతున్నారు.



# రైతాంగ సమస్యలు పరిష్కరించాలి



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** రైతులకు చేయూతనందించి రైతాంగ సమస్యలు పరిష్కరించాలని నంది రైతు సమాఖ్య ప్రతినిధులు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారిని కోరారు. శనివారం సమాఖ్య ప్రధానకార్యదర్శి ఎం.వి కృష్ణారెడ్డి, సలహాదారు ఓబుల పతి,మధుసూధనరెడ్డి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లా డుతూ ఖరీఫ్‌లో నాణ్యమైన విత్తనాలు సీజన్ కు ముందే రైతులకు సరఫరా చేయాలని, ప్రత్తిలో కల్తీలేని హైబ్రీడ్ విత్తనాలు సరఫరా చేయాలన్నారు. ఎరువులు, క్రిమి సంహారక మందులు సకాలంలో రైతులకు అందజేయాలని, సీజన్‌కు ముందే వరి,ప్రత్తి, జొన్న మొదలగు పంటలకు విస్తీర్ణాన్ని మండలాల వారిగా స్థిరీకరించాలని కలెక్టర్ ను కోరారు. ప్రభుత్వపరంగా రైతాంగశ్రేయస్సుకు కృషిచేస్తామని కలెక్టర్ హామి ఇచ్చినట్లు రైతు సంఘం ప్రతినిధులు తెలిపారు.

# శ్రీ చౌడేశ్వరీ అమ్మవారికి పల్లకీ సేవ

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్ః** శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి పల్లకి సేవను నందవరం గ్రామంలోని శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారంనాడు వైభవంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారంనాడు అమ్మవారి పల్లకి సేవను నిర్వహించడం ఆనవాయితి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో అలంకరించి వేద మంత్రోచ్ఛర నడుమ పల్లకిలో కూర్చొబెట్టి ప్రధాన ఆలయం చుట్టూ పల్లకి సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమీషనర్ మరియు ఆలయ నిర్వహణ అధికారిని కామేశ్వరమ్మ, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారి పల్లకి సేవ దృశ్యం

# దేశ సమైక్యతను కాపాడండి

**పత్తికొండ మేజర్ న్యూస్ :** దేశ ప్రజలందరూ మత సామరస్యాన్ని పాటించాలని దేశ సమైక్యతను కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, సీపీఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్ పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్‌నుండి నాలుగు స్తంభాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఎం పార్టీ మండల కార్యదర్శి చక్రాల వెంకటేవ్వర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్‌లు మాట్లాడుతూ, దేశంలో మతసామరస్యం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం మీద దాడి జరుగుతుందని ప్రజలందరూ దీనినుండి బయట పడడానికి ప్రజాస్వామ్యవాదులు అన్ని రాజకీయపార్టీలు కలిసి మతతత్వం నుండి ఉగ్రవాదం నుండి ఎదుర్కొనే పరిస్థితి దేశంలో ఉందని, కావున ప్రజలందరూ ఏకధాటిపై నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌పార్టీ మండల కార్యదర్శి నాగరాజు, కాంగ్రెస్ మండల నాయకులు మహ్మద్ బాష, సీపీఐ మండల కార్యదర్శి రాజుసాహెబ్, మైనార్టీ సంఘం నాయకులు కపీల్, ఇబ్రహీం, కెవిపిఎస్ నాయకులు రమేష్, ఎమ్మార్పిఎస్ నాయకులు రవి, గిరిజన సంఘం నాయకులు భాస్కర్ నాయక్, దళిత సమాఖ్య నాయకులు సీను, సర్పంచుల సంఘం నాయకులు కేశవరెడ్డి, ఫర్టిలైజర్స్ సంఘం నాయకులు గాంధీ రెడ్డి, సీపీఎం మండలనాయకులు దస్తగిరి రంగారెడ్డి, గోపాల్, ప్రజానాట్య మండలి నాయకులు కాశన్న, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.


# యోగా తోనే మానసిక ప్రశాంతత



**డోన్ రూరల్ మేజర్ న్యూస్ :** యోగతోనే మానసిక ప్రశాంతత సాధ్యపడుతుంది అని ఆయుర్వేదిక్ డాక్టర్ గ్రేస్ సెబాస్టియన్ పేర్కొన్నారు. యోగాంధ్ర లో భాగంగా శుక్రవారం పట్టణంలోని స్థానిక కె వి ఎస్ పార్క్‌లో దాదాపు 80 మంది ప్రజలకు యోగా పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాంత్రికమయమైన నేటి మానవ జీవన శైలి లో యోగ కు ఉన్న ఆవశ్యకత ను వివరించారు.

# మూఢాచారాలతో మూగజీవాల బలి

బలి ఇచ్చి చెట్టుకి వేలాడదీస్తున్న మూగజీవారు ( గొర్రెలు)



**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :** వర్షాకాలంలో వర్షాలతో మేకలు గొర్రెలు ఇతర జంతువుల మచూచి, కలవర, బొబ్బదాలు, ముక్కుదిమ్మడ, ఆటలమ్మ, గాలికుంట్ల, గొంతువాపు వ్యాధులు ప్రబలి మూగజీవాలు మృతి చెందుతూ ఉంటాయి. ఇలాంటి వ్యాధులు సంక్రమించినప్పుడు మూగజీవాల అధికంగా చనిపోతుండడం జరుగుతుంది. వ్యాధులు ప్రబలకుండా చిన్నప్పటి నుండే వ్యాక్సిన్లు వేస్తే పై అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయి. వర్షాకాలంలో ఈ వ్యాధి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. వీటిని అధికారులు చికిత్సలు చేసి వ్యాధి బారి నుండి కాపాడాలి. అయితే ఈ వ్యాధులు సంక్రమించినప్పుడు గొర్రెలు మేకలు పశువుల అధికంగా చనిపోతాయి అవి చనిపోకుండా ఉండేందుకు గొర్రెను బలి ఇచ్చి చెట్టుకు వేలాడదీస్తే ఈ వ్యాధులు రావని ఆచారాలు, మండలంలోని చాగలమరి సమీపంలోని హైవే రోడ్డులో వ్రేలాడదీయడం జరిగింది. ఈదృశ్యంమేజర్‌న్యూస్‌కనబడడంతోక్లిక్ మనిపించింది.

# స్పౌజ్ పింఛన్లు మంజూరు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం స్పౌజ్ పింఛన్లను మంజూరు చేసింది. సామాజిక భద్రత పింఛన్ తీసుకుంటున్న భర్త చనిపోతే.. అతని భార్యకు ఆ తదుపరి నెల నుంచే పింఛన్ అందించేలా ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గత సంవత్సరం నవంబర్ 1 నుంచి దీన్ని అమల్లోకి తెచ్చింది.. దీనికి సంబంధించి స్పౌజ్ కేటగిరీలో పింఛన్లు పొందేందుకు అర్హులైన వారినుంచి దరఖాస్తులుస్వీకరించింది. అందులో భాగంగా అర్హులను గుర్తించారు. నియోజకవర్గంలోనిఆళ్లగడ్డ మండలానికి 58స్పౌజ్ పెన్షన్లు, ఆళ్లగడ్డ నగర పంచాయతీకి 44 మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. ఉయ్యాలవాడ మండలానికి 43, దొర్నిపాడు మండలానికి 36, సిరివెళ్ల మండలానికి 97, రుద్రవరం మండలానికి 62, చాగలమర్రి మండలానికి 81 స్పౌజ్ పింఛన్లు మంజు రయ్యాయని అధికారులు తెలిపారు. మే నెలకి సంబంధించిన పింఛన్లను జూన్ 12న పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

## అర్హులైన పేదలందరికీ గృహ నిర్మాణానికై రూ.5 లక్షలు ఇవ్వాలి

**జూన్ 2న మండల కార్యాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలి..**

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్..**



గోడపత్రకలను విడుదల చేస్తున్న సిపిఐ నాయకులు

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** జిల్లాలో అర్హులైన పేదలందరికి గృహ నిర్మాణ పథకం కింద ప్రతి ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు నిధులు మంజూరు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి వీరేష్.రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు పేర్కొన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగాఇచ్చిన వాగ్దానం మేరకు పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు ఇంటి స్థలాలు, ఇంటి నిర్మాణానికి 5 లక్షలు, సూపర్ 6 పథకం హామీలు వెంటనే అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే జూన్2 తేదీన పెద్దకడుబూరు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు జరగబోయే ధర్నా కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను పెద్దకడబూరు సిపిఐ కార్యాల యం ముందు విడుదల చేయడం జరిగింది. బాబు హసన్ చిన్నోడు నరసింహులు నబి రసూల్ చాంద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశంకు హాజరైన బుట్టా దంపతులు



గృహప్రవేశ పూజల్లో బుట్టా దంపతులు

**ఎమ్మిగనూరు ,మేజర్‌న్యూస్ ప్రతినిది :** ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిలర్ వైకాపా సీనియర్ నాయకులు మీసాల నీలకంఠప్ప నూతన గృహప్రశంలో ఎమ్మిగనూరు వైకాపా సమన్వయకర్త, మాజీ ఎంపి బుట్టారేణుక, బుట్టా నీలకంఠప్పలు పాల్గొన్నారు. శుక్రవారం వీవర్స్ కాలనీలో ఇటీవల నిర్మించుకున్న నూతన గృహంలోకి కౌన్సిలర్ కుటుంబం ప్రవేవిం చారు. ఈసందర్భంగా వారు శ్రీ సత్యనారయణస్వామి వ్రతం పూజల్లో పాల్గొన్నారు. వారికి కుటుంబసభ్యులు సాదరస్వాగతం పలికారు ఆడపడుచు లాంచనాలు చేపట్టారు. అర్చకుల చేత తీర్థ ప్రసాదాలు వితరణ చేపట్టారు. అనంతరం పార్టీ శ్రేణులతో విందు బోజనంలో ఆమె పాల్గొన్నారు.

# రైతులు శాస్త్రీయ సలహాలు పాటించి వ్యవసాయం లాభసాటిగా మార్చుకోండి



**ఆళ్లగడ్డ,మేజర్‌న్యూస్ :** రైతులు శాస్త్రీయ సలహాలు పాటించి పెట్టుబడి ఖర్చు తగ్గించుకొని వ్యవసాయంలాభసాటిగా మార్చుకోవాలని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త, డా. వెంకటేశ్వర్లు, కేవీకే శాస్త్రవేత్తలు డా. కృష్ణ మూర్తి, ఆదినారాయణలు అన్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ మరియు భారత వ్యవసాయ పరిశోధన మండలి ఆద్వర్యం లో కృషి విజ్ఞాన కేంద్రం యాగంటి పల్లె ద్వారా వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం శుక్రవారం మండలంలోని కృష్ణాపురం, బాచేపల్లె, పెద్దకందుకూరు గ్రామాల్లోనిర్వహించారు. ఈసందర్భంగావారు మాట్లాడుతూరైతులు శాస్త్రీయ సలహాలు పాటించి పెట్టుబడి ఖర్చు తగ్గించుకొని వ్యవసాయం లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. అలాగే ఖరీఫ్ ముందు చేపట్టాల్సిన సన్నద్ధత కార్యక్రమాలపై వివరించారు. ఇందులో భూసారా ఆధారిత ఎరువుల యాజమాన్యం మరియు ప్రస్తుతంపంటల్లో వేయాల్సినఎరువుల మొతాదును వివరించారు. కంది, వేరుశనగ, కొర్ర, మొక్కజొన్న, వరి పంటల్లో సస్యరక్షణ చర్యలైన విత్తన శుద్ధి, తెగుళ్ళు, పురుగు మందుల యాజమాన్య పద్ధతులపై, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. అలాగే వ్యవసాయ శాఖ అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై ఏవో కిషోర్ కుమార్ రెడ్డి అవగాహన కల్పించారు. ఉద్యాన పంటల్లో అధిక దిగుబడులు పొందాలంటే మేలైన రకాల ఎంపిక అవసరం అన్నారు. నిమ్మ పంటను సందర్శించి ప్రస్తుతం చేపట్టాల్సిన యాజమాన్య ద్రవ జీవామృతం తయారు పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శేషార్జున్, సాల్మన్, సుధా రాముడు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# రాయితీపై వేరుశనగ విత్తనాలు..వ్యవసాయ శాఖ అధికారి



వేరుశనగ విత్తనాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి

**వెల్దుర్తి,మేజర్ న్యూస్:** వెల్దుర్తి మండలానికి రాయితీ పై 620 క్వింటాల వేరుశనగ విత్తనాలను జిల్లా అధికారులు కేటాయించడం జరిగిందని వెల్దుర్తి మండల వ్యవసాయ శాఖ అధికారి అక్బర్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో రైతులకు కదిరి 6 రకం వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చేరుకులపాడు రైతు సేవా కేంద్రములో వేరుశనగ విత్తనాల నాణ్యతను రైతులతో కలసి పరిశీలించడం జరిగిందని తెలిపారు. కావలసిన రైతులు గ్రామంలోని రైతు సేవ కేంద్రాల దగ్గరకు రైతు పొలం పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, సెల్ ఫోన్ నెంబర్, తీసుకొని వెళ్లి సిబ్బందిని సంప్రదించి వారి యొక్క పేరును నమోదు చేసుకోవాలన్నారు. ఒక్క పాసు పుస్తకంకు మూడు సంచుల వేరు శనగ విత్తనాలను అందించడం జరుగుతుందన్నారు. రాయితీ వివరములు క్వింటానికి పూర్తి ధర రూ,9,300 రూపాయలు గాను సబ్సిడీ 40% రూ. 3,720 పొగ రైతు కట్టవలసిన రూ. 5,580లు కట్టి కదిరి 6రకం వేరుశనగ విత్తనాలను తీసుకువెళ్లాలన్నారు.

**పత్తి పంట పై రైతుల ఆసక్తి :** మండలములో రైతులు పత్తి పంటపై ఆసక్తి చూపుతున్నారనీ రైతులు రిజిస్టర్, లైసెన్స్ కల్గిన దుకాణాలలో మాత్రమే పత్తి విత్తనాలు కొనుగోలు చేసి దుకాణము నుండి తప్పనిసరిగా బిల్ రసీదును తప్పనిసరిగా పొందాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల వద్ద మోసపోయి నాసిరకం పత్తి విత్తనాలను కొనవద్దని రైతులకు తెలియజేశారు.

## శ్రీ ఉమామహేశ్వరులను దర్శించుకున్న ఏపీఆర్యవైశ్య కార్పోరేషన్ ఛైర్మెన్



**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్ః** బనగానపల్లె మండల పరిధిలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి వారిని తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగాల రాష్ట్ర అద్యక్షులు ఆర్యవైశ్య కార్పోరేషన్ ఎపీ రాష్ట్ర ఛైర్మెన్ డుండి రాకేష్ శుక్రవారంనాడు ఉమామహేశ్వరులను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలను అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టంగుటూరి శీనయ్య, న్యాయవాది నాగేందర్ రెడ్డి, బండి వెంకటేష్ , బండారు ప్రకాష్ పాల్గొన్నారు.

## వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన కార్యక్రమం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని బోయరేవుల, మాదవరం, మోత్కూరు గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కెవికె శాస్త్రవేత్త రమణయ్య, కెవికె శాస్త్రవేత్త సుధాకర్, ఐఐఎంఆర్ శాస్త్రవేత్త సుగన్న, డిఆర్‌సిఎడిఏ సరళమ్మ, బిటిహెచ్ ఆత్మ డిఆర్‌సి ఉమామహేశ్వరీలు పాల్గొని ఎరువులు, వాటి ఉపయోగాలు, ఏ పంటకు ఎంత మోతాదులో ఉపయోగించాలి, దిగుబడులు ఎలా పెంచుకోవాలనే విషయాలపై రైతులకు తెలిపారు. బాస్వరం నిలువలు భూమిలో ఎక్కువగా ఉన్నాయని బాస్వరం భూసార పరీక్ష చేసుకుని అందుకు అనుగుణంగా చివరి దుక్కిలో వేయాలని ఇందువల్ల రూ. 3 వేల నుంచి రూ. 5 వేల వరకు ఎకరాకు ఖర్చును తగ్గించుకోవచ్చని తెలిపారు. కొత్త వంగడాలు, కలుపు నివారణ చర్యలు, కలుపు వల్ల దిగుబడి ఎలా తగ్గుతుంది, నివారణ చర్యలు తెలిపారు. వరి మాగానిలో జిరో టిల్లేజ్‌లో దుక్కి దున్నకుండా మినుము, పెసలు, మొక్కజొన్న పంటలు వేసి దుక్కి అడుగుమన్ను ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఎరువులు, పురుగు మందులు తగ్గించి పంటలు పండించాలని తెలిపారు. అవసరమైన మేరకు ఎరువులు వాడి ఖర్చు తగ్గించుకోవాలని తెలిపారు. హానికర మందుల నుంచి కాపాడి ప్రజలకు మంచి ఆహారంను అందజేయాలని తెలిపారు. రైతు అనుభవానికి శాస్త్రవేత్తల శాస్త్ర విజ్ఞానం జోడించి వ్యవసాయంలో కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు పండించి ప్రపంచ మార్కెట్‌లో పోటీపడి దిగుబడిలను ఎగుమతి చేయాలని తెలిపారు. పశువులకు సకాలంలో టీకాలు వేయించాలని తెలిపారు. పాల ఉత్పత్తి పెంచేందుకు దాన, దూడల పెంపకం, 14 నెలలకు బర్రె లేదా ఆవుకు మళ్లీ ఎదకు వచ్చేలా చూడాలని రైతులకు తెలిపారు. పశు వైద్యాధికారి ఆయా పథకాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉద్యాన శాఖ అధికారిణి చందన, మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఖాళీలను బదిలీలలో చూపించాలి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ప్రత్యేక విద్య ఉపాధ్యాయ సహాయకుల పోస్టల ఖాళీల వివరాలను బదిలీలలో చూపాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్‌లు ప్రభుత్వాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి మండలానికి ఇటీవల ఒక ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టును మంజూరు చేశారని అన్నారు. అయితే ప్రస్తుతం చేపడుతున్న బదిలీలలో ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులను కేవలం 5 మాత్రమే చూపిస్తున్నారని అన్నారు. దీని వల్ల బదిలీలు పొందాలనుకునే ఉపాధ్యాయులు నష్టపోతారని అన్నారు. దూర ప్రాంతాల్లో ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్న వారు బదిలీల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. కేవలం 5 పోస్టులను ఖాళీలుగా చూపించడంతో సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోతున్నారని అన్నారు. అధికారులు స్పందించి కొత్తగా మంజూరైన ప్రత్యేక విద్య ఉపాధ్యాయ సహాయ పోస్టులను ఖాళీలుగా చూపించాలని డిమాండ్ చేశారు.

# రూ.3 కోట్ల వ్యయంతో కళ్యాణ మండపం నిర్మాణం



నందవరంలో కళ్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి బి.సి

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె మండల పరిధిలోని నందవరం శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి ఆలయ సమీపంలో నూతన కళ్యాణమండపం నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి శుక్రవారం నాడు భూమి పూజ చేశారు. వారు నందవరం చేరుకోగానే తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి ఘనస్వాగతం పలికారు. ముందుగా సాక్షిమాత శ్రీ చౌడేశ్వరీ అమ్మవారు ఆలయంలో పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ సమీపంలో నూతన కళ్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ నందవరం శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి ఆలయ సమీపంలో కళ్యాణ మండపం దాదాపు 3కోట్ల వ్యయంతో నిర్మించడం జరుగుతుందని నందవరంలో కళ్యాణ మండపం లేకపోవడంతో వివాహాది శుభకార్యాలు జరుపుకోవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారి కోరిక మేరకు కళ్యాణ మండపం నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ కామేశ్వరమ్మ, ఆలయ ఛైర్మెన్ పి.వి కుమార్‌రెడ్డి,పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

# మహావైభోగంగా స్వర్ణోత్సవ కలశ మహాకుంభాభిషేకం

- రాజగోపురం శిఖర కళాశాలకు అభిషేకం
- సిద్ధిబుద్ధి సమేత మహాగణపతి చలప్రతిష్ఠ
- ముగిసిన స్వర్ణోత్సవ వేడుకలు



**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :**నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ కోదండ రామాలయ 50వ స్వర్ణోత్సవ వేడుకలు శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో అత్యంత వైభోగంగా మహాదానందంగా...కనులపండువగా కొనసాగాయి. ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభమైన ఉత్సవాలలో భాగంగా శివాలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ట, అన్ని ప్రధాన ఆలయాలు, ఉప ఆలయాలు, పరివార దేవతలకు, 14 శిఖర కళశాలకు శ్రీశ్రీ పుష్పగిరి పీఠాధిపతి జగద్గురు శ్రీ విద్యాశంకర భారతి మహాస్వామి సంప్రోక్షణతో పాటు ఆలయం ఆవరణంలో హోమాలు నిర్వహించారు. చివరి రోజు 30వ తేదీ శుక్రవారం పీఠాధిపతిచే సిద్ధిబుద్ధి మహాగణపతి చలప్రతిష్ట, శ్రీకాశీవిశ్వేశ్వరునికి అభిషేకంతో పాటు రాజగోపురం శిఖర కళాశాలకు మహాస్వామి అభిషేకం చేశారు. మహావైభోగంగా స్వర్ణోత్సవ కలశ మహాకుంభాభిషేకం, మహాభక్త జనసందోహం మధ్య అత్యంత వైభవంగా కొనసాగాయి. భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.



రాజగోపురానికి కలశస్థాపన చేసిన అనంతరం అభిషేకం చేస్తున్న పీఠాధిపతి



పీఠాధిపతికి కోలాటంతో స్వాగతం పలుకుతున్న మహిళలు

# వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన కార్యక్రమం




అవగాహన కల్పిస్తున్న అధికారులు

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని బోయరేవుల, మాద వరం, మోత్కూరు గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కెవికె శాస్త్రవేత్త రమణయ్య, కెవికె శాస్త్రవేత్త సుధాకర్, ఐఐఎంఆర్ శాస్త్రవేత్త సుగన్న, డిఆర్‌సిఏడిఏ సరళమ్మ, బిటిహెచ్ ఆత్మ డిఆర్‌సి ఉమామహేశ్వరీలు పాల్గొని ఎరువులు, వాటి ఉపయోగాలు, ఏ పంటకు ఎంత మోతాదులో ఉపయోగించాలి, దిగుబడులు ఎలా పెంచుకోవాలనే విషయాలపై రైతులకు తెలిపారు. బాస్వరం నిలువలు భూమిలో ఎక్కువగా ఉన్నాయని బాస్వరం భూసార పరీక్ష చేసుకుని అందుకు అనుగుణంగా చివరి దుక్కిలో వేయాలని ఇందువల్ల రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఎకరాకు ఖర్చును తగ్గించుకోవచ్చని తెలిపారు. కొత్త వంగడాలు, కలుపు నివారణ చర్యలు, కలుపు వల్ల దిగుబడి ఎలా తగ్గుతుంది, నివారణ చర్యలు తెలిపారు. వరి మాగానిలో జిరో టిల్లేజ్‌లో దుక్కి దున్నకుండా మినుము, పెసలు, మొక్కజొన్న పంటలు వేసి దుక్కి అడుగుమన్ను ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు. ఎరువులు, పురుగు మందులు తగ్గించి పంటలు పండించాలని తెలిపారు. అవసరమైన మేరకు ఎరువులు వాడి ఖర్చు తగ్గించుకోవాలని తెలిపారు. హానికర మందుల నుంచి కాపాడి ప్రజలకు మంచి ఆహారంను అందజేయాలని తెలిపారు. రైతు అనుభవానికి శాస్త్రవేత్తల శాస్త్ర విజ్ఞానం జోడించి వ్యవసాయంలో కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు పండించి ప్రపంచ మార్కెట్‌లో పోటీపడి దిగుబడిలను ఎగుమతి చేయాలని తెలిపారు. పశువులకు సకాలంలో టీకాలు వేయించాలని తెలిపారు. పాల ఉత్పత్తి పెంచేందుకు దాన, దూడల పెంపకం, 14 నెలలకు బర్రె లేదా ఆవుకు మళ్లీ ఎదకు వచ్చేలా చూడాలని రైతులకు తెలిపారు. పశు వైద్యాధికారి ఆయా పథకాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉద్యాన శాఖ అధికారిణి చందన, మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి వివేకా బాబాయ్ గొడ్డలిపోటు

# దినం నిర్వహించాలి

– టిడిపి కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** వైసిపి పార్టీ వెన్నుపోటు దినం నిర్వహించుకోవాలని నిర్ణయించడం జరిగిందని, ముందుగా వివేకా బాబాయ్ గొడ్డలిపోటు దినం నిర్వహించి ఆ హత్యలో ద్రోహులు ఎవరో తేల్చాలని టిడిపి కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి విమర్శించారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఇతర టిడిపి నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో వివేకా హత్యను ఎందుకు నిగ్గు తేల్చలేదని ప్రశ్నించారు. కడపలో నిర్వహించిన మహానాడుతో జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడ దాక్కున్నారో వైసిపి నాయకులకు దిక్కుతోచడం లేదని టిడిపి సత్తా ఏంటో ఒక మహిళ ద్వారా మహానాడు నిర్వహించి నారీ శక్తి ఎలా ఉంటుందో చంద్రబాబు నాయుడు జగన్‌కు చూపించారన్నారు. టిడిపి జెండా లేకుండ చేస్తామని ప్రగల్భాలు పలికిన జగన్ పసుపు జెండా సత్తా ఏంటో కడప గడ్డమీదనే చూపించారన్నారు. మంత్రి టీజీ భరత్‌పై మాజీ మంత్రి కెఈ ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు అధిష్టానం దృష్టికి వెళ్లగా ఏ చర్యలు తీసుకోనుందని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు తిక్కారెడ్డి సమాధానం దాట వేశారు. కు.డా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కడపలో జరిగిన మహానాడు దేశం, ప్రపంచ స్థాయిలోనే సంచలనం సృష్టించిందన్నారు. జగన్ పని ఇక అయిపోయిందని అక్కసుతో కుళ్లిపోతున్నారని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని రాష్ట్ర ప్రజలు నమ్మి టిడిపికి పట్టం కట్టారని జగన్‌ను 11స్థానాలకే పరిమితం చేశారని విమర్శించారు. తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని జగన్ మళ్లీ సిఎం కావాలనుకోవడం సిగ్గు చేటన్నారు. కడప జిల్లా నుండే జగన్‌కు ప్రజలు రాజకీయ సమాధి కట్టే పరిస్థితి ఉందని, బెంగళూరు ప్యాలెస్‌కు పరిమితం కావాలని సూచించారు. కొందరు వైసిపి నాయకులు రెడ్ బుక్ గురించి విమర్శలు చేస్తున్నారని దొంగలకే రెడ్‌బుక్ అంటే భయం ఉంటుందని అన్నారు. తప్పు చేసిన వారికి దండన తప్పదని మంచి వారికి ఏమీ కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకెపోగు ప్రభాకర్, నాగేశ్వర యాదవ్, నాగేంద్ర, ఈశ్వర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి

– ఎంపి బస్తిపాటి నాగరాజు



గ్రామస్తులకు అభివాదం చేస్తున్న ఎంపి నాగరాజు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్రామీణ ప్రాంతాలన్నీ అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. శుక్రవారం కర్నూలు మండలం రేమట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఊరువాకిలిని కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా గ్రామంలో పర్యటించి గ్రామ సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం పంచాయతీ నిధులను దారి మళ్లించి గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పంచాయతీలకు ప్రత్యేక నిధులు విడుదల చేసి అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెద్ద వెంకన్న, గ్రామ టిడిపి నాయకులు ఊరువాకిలి వెంకటేశ్వర్లు, శేఖర్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.